RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 18 | పేజీలు : 4 | బుధవారం 22 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు

- 95 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సరఫరా ఆందోళనలే కారణం
- ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై ప్రభావం చూపే అవకాశం
- ఒపెక్ దేశాల నిర్ణయాలపై ఆధారపడనున్న మార్కెట్ గమనం





## 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రధాని క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టు



## తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

వైసీపీ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూ భాగోతాలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం దారుణమన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించి సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పరువు తీసిన వారిని ధర్మాన వంటి నేతలు వెళ్లి పరామర్శించడం, జగన్ వారిని సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపులు తమ సంస్కృతి కాదని, తప్పు చేసిన ఎవరినైనా కూటమి ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించి తీరుతుందని స్పష్టం చేశారు.

### భోగాపురం విమానాశ్రయ

## ప్రారంభోత్సవానికి ఆహ్వానం



- ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ.. ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరా యలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.ఖ

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి



- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు.



## విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు

- ప్రతిపక్షాలపై రాజ్‌నాథ్ సింగ్ ఫైర్
- యువతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్న రక్షణ మంత్రి
- యువతకు అన్యాయం జరగనివ్వబోమని రాజ్‌నాథ్ భరోసా
- విద్యార్థులు, యువత సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని హామీ
- చర్చ జరగాల్సిన వేదిక పార్లమెంటేనని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వీధుల్లో కాకుండా సభలో వెల్లడించాలని హితవు

### రేపు తెలంగాణలో విద్యాసంస్థల

## బంద్‌కు పిలుపు



దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా జులై 24న తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ఈ బంద్‌లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు బంద్ వివరాలను వెల్లడించారు. వరుస పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని, విద్యా వ్యవస్థ స్వయంప్రతిపత్తికి భంగం కలిగిస్తోందని ఆరోపిస్తున్న వీబీఎస్ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసుల దాడిపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 24న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, మేధావులు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది.

బుధవారం 22 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం
అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

### జీవితాంతం గుర్తుండేలా...

# గురు కులం చదువు..!!

**రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలు...రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.**

**బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం.**

**బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు.**

**కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువ.**

**ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10 కొత్త గురుకులాల ఏర్పాటు చేశాం.**

**6 బీసీ బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్.**

**....వైసీపీ నాయకులు వాళ్లింటి ముందు రోడ్లు కూడా వేసుకోలేకపోయారు.**

**.....వాళ్లా మిమ్మల్ని విమర్శించేది..?**

**.....ససన్నకోట బీసీ గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత**





**రామగిరి జులై 22 సీమ వార్త సాయంత్రం.**

ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో పది కొత్త మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామని, వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ గురుకులాల సీట్లకే డిమాండ్ ఎక్కువ ఉందన్నారు. తమ ఇళ్ల ముందు రోడ్లు

- మిగతా3లో

# ఢిల్లీ గడ్డపై ఏంటి ఈ రక్తపు చుక్కలు!

**కేంద్ర ప్రభుత్వంపై... మడక శిరలో రఘు"వీరా'గ్రహం".**


**మోడీ హఠావో, దేశ్ బచావో అంటూ మార్మోగిన మడకశిర.**

**కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యులు, మాజీమంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన, ర్యాలీ.**

**పాల్గొన్న రఘువీరారెడ్డి, కేటీ శ్రీధర్, పెనుగొండ ఇన్చార్జి నరసింహులు.**







**మడకశిర జూలై 22 సీమ వార్త సాయంత్రం**

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమే ఢిల్లీ గడ్డలో విద్యార్థుల రక్తపు చుక్కలని కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యులు మాజీ మంత్రి రఘువీరారెడ్డి తీవ్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఢిల్లీలో జరుగుతున్న ఘటనలకు నిరసనగా బుధవారం మడకశిర పట్టణంలో రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేటి శ్రీధర్, పెనుగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నరసింహులు తదితర ప్రముఖులు ఈ నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో బ్యానర్లు చేతపుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ లీకుల రాజ్యంలో నిరుద్యోగుల ఆక్రందనలు.. 12 ఏళ్లలో ఏకంగా 152 సార్లు పేపర్లు లీక్ జఔజ సభ్యులు రఘువీరారెడ్డి ఫైర్ అయ్యారు.?ఢిల్లీ నడిబొడ్డున విద్యార్థుల రక్తపు మరకలు.. ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలే సమాధానమా...కేంద్రంపై రఘువీరా నిప్పులు చెరిగారు.

?ఏటా 2 కోట్ల ఉద్యోగాలెక్కడ?.. 21 కోట్లకు చేరిన నిరుద్యోగ రక్కసి...మోడీ సర్కార్‌పై రఘువీరారెడ్డి ధ్వజం ఎత్తారు. ?చదువు చెప్పే బడులకే మంగళం.. ఏకంగా 94 వేల స్కూళ్లను మూసేసిన ఘనత మోడీదే... రఘువీరా ఆగ్రహం వ్యక్తం చేశారు.?మహిళా నేత అని కూడా చూడకుండా ప్రియాంక గాంధీని రోడ్డుపై ఈడ్చుకెళ్తారా.. రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు.?కోర్టులు, ఎలక్షన్ కమిషన్, వ్యవస్థలన్నీ ప్రధాని చేతుల్లోనే ఉన్నాయా..మోడీ వైఖరిపై రఘువీరా మండిపడ్డారు.?ప్రశ్నాపత్రాల లీకేజీలపై రాహుల్ గాంధీ నిలదీస్తుంటే.. స్పీకర్ డ్రామాలాడుతున్నారు... రఘువీరా ఘాటు వ్యాఖ్యలు చేశారు.?విద్యార్థులు, నిరుద్యోగులతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవు.. మోడీ వినాశ కాలం మొదలైంది: రఘువీరారెడ్డి హెచ్చరించారు. "మోడీ హఠావో.. దేశ్ కో బచావో".. ఈ లీకుల ప్రభుత్వం కూలిపోయే వరకు పోరాటం ఆగదు....రఘువీరారెడ్డి స్పష్టం చేశారు.

### పల్లె జనం క్షేమంపై

# కలెక్టర్ కన్ను!

**మారుమూల మండలాల పై సైతం కలెక్టర్ ప్రత్యేక దృష్టి.**

**అధికార యంత్రాంగానికి దడ పుట్టిస్తున్న వైనం.**

**ఆమడగూరు ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, తాసిల్దార్ కార్యాలయం, సచివాలయాన్ని, ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీలు**

**జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**





**ఆమడగూరు జూలై 22: సీమ వార్త సాయంత్రం.**

విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆమడగూరు మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారి విద్యాభ్యాసం మరియు పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.కలెక్టర్ స్వయంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన స్థాయిని పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నతమైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, వంటగది పరిశుభ్రతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని నిబంధనల ప్రకారం నాణ్యతతో

- మిగతా3లో

# 2 వ విడత 125మంది.... జర్నలిస్టులకు ఆక్రిడేషన్లు.

**......శ్రీ సత్య సాయి జిల్లాలో 125 మంది జర్నలిస్టులకు రెండవ విడతగా అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం.**

**.....మరో 3 నెలల్లో మూడో విడత అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ.**

**.....ప్రజలకు, ప్రభుత్వానికి పాత్రికేయులు వారిదిగా పనిచేయాలి.**

**.....ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా మీడియా ద్వారా ప్రచారం చేయాలి.**

**..... జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో....డిఆర్ఓ కొండయ్య**





**పుట్టపర్తి జూలై 22 సీమ వార్త సాయంత్రం.**

శ్రీ సత్య సాయి జిల్లాలో అర్హులైన 125 మంది జర్నలిస్టులకు రెండవ విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందని డిఆర్ఓ కొండయ్య తెలిపారు.బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు డిఆర్ఓ కొండయ్య అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా డిఆర్ఓ కొండయ్య మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ జీవో నం 84 నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.మొదటి సమావేశంలో 125 కి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు. ఇంకనూ అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి మూడవ సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రస్తుతం 2026 - 27 సంవత్సరానికి మంజూరు కాబడిన సదరు దరఖాస్తులను డియంఎసి సభ్యులు సమన్వయ సహకారాలతో అక్రిడేషన్ మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని డిఆర్ఓ సూచించారు. ముఖ్యంగా పాత్రికేయులు సమాజానికి ప్రభుత్వానికి వారిదిగా ఉంటూ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువుగా తీసుకెళ్లే విధంగా సమాచార శాఖతో పాటు పాత్రికేయులు కృషి చేయాలన్నారు.జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలు పాత్రికేయులు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాత్రికేయ రంగం ద్వారా సమాజానికి విలువైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి టి. భరత్ కుమార్ రెడ్డి, సమాచార శాఖ ఏఈఐఈ రామాంజనేయులు , ఏపీఎస్ఆర్టీసీ నుండి ఉషారాణి, భాస్కర్ డిఎమ్డహెచ్ఓ నుండి డాక్టర్ సునీల్ సాగర్, జిల్లా అక్రిడిడేషన్ కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయులు పుల్లయ్య, చక్రపాణి, కెవి సుబ్బయ్య,శంకరప్ప, శివకుమార్ ,గోవర్ధన్ రెడ్డి, శివరామకృష్ణ, వెంకటరమణప్ప, శివప్ప,తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం
బుధవారం
22 జూలై 2026

# శ్రీ కృష్ణ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ను....ప్రారంభించిన ఏఓ, ఎంపిడిఓ.

**తనకల్లు, జులై 22 సీమవార్త సాయంత్రం.**

తనకల్లు మండల కేంద్రములో బి ఆర్ సి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భారతి ఎంపిడిఓ రామానాయక్ మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ఆచరించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్లు బయో రిసోర్స్ సెంటర్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ప్రతి రైతు తమ పంటను తప్పనిసరిగా నమోదు చేసుకొని పంట బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యన్ ఎఫ్ ఎ దామోదర్ రెడ్డి మరియు బయో రిసోర్స్ సెంటర్ ఇన్‌చార్జ్ మల్లికార్జున్ మాట్లాడుతూ, ఈ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వివిధ ఉత్పత్తులు మరియు సామగ్రి రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాటిలో పియం డి యస్ విత్తనాలు, ఏటియం విధానానికి



సంబంధించిన కూరగాయలు మరియు ఆకుకూరల విత్తనాలు, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, వివిధ ప్రకృతి వ్యవసాయ ద్రావణాలు, నీమాస్త్రం, ద్రమ్ములు, వేప నూనె తదితర సామగ్రి లభ్యమవుతాయని వివరించారు. రైతులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి



భారతి ఎంపిడిఓ రామానాయక్, యన్ ఎఫ్ ఎ దామోదర్ రెడ్డి, బయో రిసోర్స్ సెంటర్ ఇన్‌చార్జ్ మల్లికార్జున్, డిటిటి సంతోష్ రెడ్డి, కుమారప్ప, యన్ యఫ్ ఐ లక్ష్మీదేవి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఖాదర్ బీ, నరేంద్ర రెడ్డి, ఈశ్వరప్ప, హరి నాయక్ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై మహిళల నిరసన



**ఓబులదేవరచెరువు (జూలై23)సీమవార్త సాయంత్రం.**

మండలంలోని చౌడంపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై మహిళలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఏడాది కాలం నుంచి గ్రామంలో తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నా సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోలేదని వారి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన నీటి ఎద్దడి పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులైన పట్టించుకోని నీటితో సమస్య తీర్చాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఇంటి ఇంటికి నీటి కుళాయిలు అని ప్రభుత్వం అధికారులు లోపల చెబుతున్న సంవత్సర కాలం నుంచి నీటి సమస్య తీర్చకపోవడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. వెంటనే నీటి ఎద్దడి తీర్చకపోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## 7038 మంది విద్యార్థులకు తల్లికి వందనం

**అమరాపురం జూలై 22 సీమ వార్త సాయంత్రం.**



మండలంలో ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం నగదు 7038 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ విద్యా సంవత్సరమునకు విద్యను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికి 13 వేల రూపాయల వంతెన నగదు తల్లుల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 54 మంది విద్యార్థులకు సంబంధించిన తల్లుల బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాల్సి ఉందని త్వరలో సంబంధిత విద్యార్థుల పోషకులు తక్షణం ఆధార్ లింక్ చేసుకోవాలని వీరికి కూడా తల్లికి వందనం డబ్బులు ఖాతాలోకి జమ అవుతాయని ఆయన పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 311 విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడం జరిగిందని ముఖ్యంగా భూములు అధికంగా ఉండడం, ఆర్థిక స్తోమత కలిగినకుటుంబం, తెల్ల రేషన్ కార్డు లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులు కావడం వంటి కారణాల ద్వారా వీరికి రాలేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం నగదును బ్యాంక్ ఖాతాలో జమ చేయడం ద్వారా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నృసింహ నామస్మరణతో మారుమ్రోగిన స్తోత్రాద్రి గిరిప్రదక్షిణ.





**కదిరి కొండ చుట్టూ గోవింద నామస్మరణ.**

**కదిరి జూలై 22 సీమ వార్త సాయంత్రం.**

తలచినంతనే మోక్షం ప్రసాదించే ఆ దేవ దేవుడు నరసింహ స్వామి శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలో ప్రహ్లాద సమేతంగా స్వయంభువుగా వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం. శ్రీ వారు కాటమ రాయుడుగా కొండల లక్ష్మీ నారసింహుడుగా కుమ్మర వాండ్ల పల్లి గ్రామంలో స్తోత్రాద్రిపై( కదిరి కొండ ) మొదట పాదం మోపారని భక్తుల విశ్వాసం అందులో భాగంగానే ప్రతి నెలా శ్రీ వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్దయెత్తున స్తోత్రాద్రి గిరిప్రదక్షిణలో భక్తాదులు పాల్గొంటున్నారు. కదిరి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే శ్రీ వారికి ప్రదక్షిణ చేసినంత పుణ్యం లభిస్తుందని భావించి గోవింద నామ స్మరణతో , హరి కీర్తనలతో ప్రతి నెలా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం శ్రీ ఖాద్రీ లక్ష్మీ నృసింహ సేవా సమితి సభ్యులు,శ్రీ వారి ఆలయ అధికారులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ , మంచినీటి పంపిణీ చేస్తున్నారు. కదిరి పట్టణ ప్రముఖులు క్రిష్ణం రాజేష్ మరియు వారి మిత్ర బృందం భక్తులకు మహాప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కదిరి నియోజక వర్గం శాసన సభ్యులు శ్రీ కందికుంట వెంకటప్రసాద్ గారు స్తోత్రాద్రి గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం కదిరి కొండ చుట్టూ రహదారి పనులు చేపట్టడం పట్ల భక్తులు,శ్రీ ఖాద్రీ లక్ష్మీ నృసింహ సేవా సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పల్లె జనం క్షేమంపై కలెక్టర్ కన్ను..!!

-మొదటిపేజీ తరువాయి

అందించాలని స్పష్టం చేశారు. పాఠశాల, కళాశాల ఆవరణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా అమడుగూరు లోని ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయం, తాసిల్దార్ కార్యాలయాని కలెక్టర్ తనిఖీలు చేస్తూ ఆయా శాఖలకు సంబంధించిన పనితీరుపై ఆరా తీస్తూ ఇది నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కటింగ్ చీరలు తప్పవని హెచ్చరిస్తూ త రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆమడగూరు తహశీల్దార్ మారుతి ప్రకాష్, స్థానిక రెవెన్యూ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని ఇంటి ముందే విధ్వంసమా... ఎంత దుర్మార్గం.

**. ఢిల్లీ ఘటనను ఖండించిన బిజెపి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్**

**గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.**



గత రెండు రోజులుగా ఢిల్లీ లో కాక్రోచ్ పార్టీ ముసుగులో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుర్మార్గ రాజకీయ క్రీడను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో నిరసన తెలపటం ప్రతి ఒక్కరి కి హక్కు ఉంది దాన్ని బీజేపీ స్వాగతిస్తున్నాము నీట్ పరీక్షల లీక్ విషయం లో కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ చాలా తీవ్రంగా స్పందించారు. దీనిపై ఇప్పటికే నిందితులను అరెస్టు చేయటం జరిగింది. దీని వెనుక ఏవ రున్నారు వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు అని కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ గారు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ కు భంగం వాటిల్లే ఏ చర్యకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినా విద్యార్థులు ఆందోళన ముసుగు లో కాంగ్రెస్ నీచ రాజకీయం చేయటం హేయమైన చర్య నరేంద్ర మోడీ బిజెపి ఎన్డీయే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు తో ఇక భవిష్యత్ లో అధికారం కు వచ్చే అవకాశం లేదు అని ఇలా దొంగ దార్లతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారు మీరు చేసే ఇటువంటి జిమ్మిక్కులు నమ్మే స్థితి లో దేశ ప్రజలు లేర నే విషయం గుర్తించాలి నిజంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళన అయితే ఇలా రాజీనామాలు చేయక పోతే దేశం ముక్కలు అవుతుంది తగుల బెడతాము అనే పదాలు వాడతారా అని ప్రశిస్తున్నాము. విద్యార్థుల ముసుగులో కాంగ్రెస్ సంఘ విద్రోహ శక్తులు దేశ నాశనాన్ని కోరే ప్రకాష్ రాజ్ లాంటి నీచులు ఉన్నారు. సంఘ విద్రోహ శక్తులు ఈ ముసుగు లో చొరబడ్డాయి. ఖబర్దార్ ఇటువంటి చౌకబారు రాజకీయాలు చేస్తే ఈ దేశంలో ముక్త కాంగ్రెస్ నడుస్తోంది ఇక భవిష్యత్ లో దేశము నుండే కాంగ్రెస్ హటావో అనే పరిస్థితికి చేరుకుంటుంది అని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కి హెచ్చరిస్తున్నాము.

## జీవితాంతం గుర్తుండేలా... గురు కులం చదువు..!!

-మొదటిపేజీ తరువాయి

కూడా వేసుకోని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోట మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు దివంగత నాయకులు పరిటాల రవి తన సొంత భూమి పది ఎకరాలను అందజేశారన్నారు. పరిటా రవి సేవా స్ఫూర్తి ఎందరికో మార్గదర్శకమన్నారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాలను తన సొంత నిధులు ఎమ్మెల్యే పరిటాల సునీత అభివృద్ధి చేస్తున్నారన్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, ఆహారం, రక్షణ కల్పిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తరగతి గదులు, విశ్రాంతి గదుల్లో దోమలు చొరబడకుండా దోమ తెరలు ఏర్పాటు చేశామన్నారు. రుచికరమైన భోజనం అందించేలా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

### ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువ

అన్న ఎన్టీఆర్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గురుకుల విద్య నాంది పలికారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను, కళాశాలలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 2014 నాటికి నవ్యాంధ్రప్రదేశ్ లో కేవలం 32 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవన్నారు. 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా మరో కొత్తగా పది ఎంజేపీ స్కూళ్లను ప్రారంభించామన్నారు. వాటిలో అయిదు రాయలసీమలోనూ, మరో అయిదింటిని ఉత్తరాంధ్రలోనూ ఏర్పాటు చేశామన్నారు. వాటితో పాటు ఆరు బాలిక బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. నసన్నకోట బీసీ గురుకులాన్ని కూడా జూనియర్ కళాశాల అప్ గ్రేడ్ చేశామన్నారు. ఇవేకాక వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త బీసీ గురుకులాలు ఏర్పాటు చేయనున్నామని, డిమాండ్ ఉన్నచోట్ల వాటిని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాల సీట్లకే డిమాండ్ అధికంగా ఉందని మంత్రి సవిత తెలిపారు.

### వాళ్లా మిమ్మల్ని విమర్శించేది...

తమ ఇళ్ల ముందు రోడ్లు కూడా వేసుకోలేని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపైనా, తమపైనా విమర్శలు గుప్పించడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నేడు తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎందరు బిడ్డలు ఉంటే అందరికీ రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కలిగేలా రూ.10,120.78 కోట్లను 42,70,802 మంది తల్లుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. విద్యా మిత్ర కిట్లను కూడా ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. ఎంజేపీ గురుకులాల్లో క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ కిట్లు కూడా పంపిణీ చేశామని మంత్రి సవిత తెలిపారు.

## అబ్దుల్ రజాక్ లేఖరి ఆధ్వర్యంలో పెన్ డౌన్ నిరసన దీక్ష



**యాడికి జులై 22 సీమ వార్త సాయంకాలం**

ప్రభుత్వం ఇచ్చిన 396 +మా కు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి లేఖరులు స్టాంప్ వెండర్ల సంఘం వారి పిలుపు మేరకు యాడికి లేఖరులు స్టాంప్ వెండర్లు జూటూరు అబ్దుల్ రజాక్ (లేఖరి)ఆధ్వర్యంలో పెన్ డౌన్ కార్యక్రమంనిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు బండారు రామకేశవులు సరోదే ఈశ్వరయ్య,మాగిశెట్టి నరేష్ కొర్రపాటి చిన్న వెంకట సుబ్బారెడ్డి సరోదే సుభాష్,ఉద్దండపు నవీన్ కుమార్ ,సహకులు పల్లా దుర్గాప్రసాద్ పోలా గంగాధర్,వుడుముల నాగార్జున శిలారి రంగనాథ స్టాంప్ వెండర్లు బండారు లక్ష్మణ ప్రసాద్, మక్కల రుక్కు తదితరులు పాల్గొన్నారు

## కొత్తగా బాధ్యతలు చేపట్టిన యస్ఐ ని సత్కరించిన హెచ్ ఆర్ఎజె



**న్యాయబద్ధంగా సేవలు అందించాలని కోరిన హెచ్ ఆర్ఎజె సభ్యులు**

**తాడిపత్రి జులై 22 సీమ వార్త సాయంత్రం:**

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్ ఆర్ఎజె) జాతీయ అధ్యక్షుడు, చైర్మన్ & ఫౌండర్ నందం నరసింహరావు ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు మిద్దె నరసింహులు ఆధ్వర్యంలో నూతనంగా తాడిపత్రి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వై. విజయ్ కుమార్ ని శాలువా, పూలమొక్కతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హెచ్ ఆర్ఎజె నేతలు మాట్లాడుతూ, ఆయన ప్రజలకు నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా సేవలందిస్తూ విధుల్లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షులు మిద్దె నరసింహులు, అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.ఎస్. రేష్మా, అనంతపురం జిల్లా ప్రతినిధి ఎస్. షాహినా, తాడిపత్రి టౌన్ అధ్యక్షులు ఎస్. శంషాద్, తాడిపత్రి టౌన్ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, ఎల్లనూరు మండల అధ్యక్షులు జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గంగంపల్లి స్మశాన వాటిక లో...కంపచెట్ల తొలగింపు.

**పాల్గొన్న బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ పూల గంగాధర్.**

**గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.**

గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లి గ్రామపంచాయతీ నందు హిందూ స్మశాన వాటిక నందు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శంకర్ నాయక్ సార్ గారు మరియు గ్రామ సెక్రెటరీ గోవర్ధన్, బిజెపి స్టేట్ కౌన్సిలింగ్ నెంబర్ గోరంట్ల సొసైటీ సింగల్ విండ్ డైరెక్టర పూల గంగాధర మరియు రామచంద్ర రెడ్డి గ్రామ ప్రజలు జేసీబీ సాయంతో ముండ్ల చెట్లు తొలగించడం జరిగింది



సీమ వార్త సాయంకాలం
బుధవారం
22 జూలై 2026

# ఆదర్శ పాఠశాలకు..... "సాయి సుధా స్టూడియో" సహకారం.





100 మంది విద్యార్థులకు ఉచితంగా గుర్తింపు కార్డులు అందజేసిన హనుమంత్ రెడ్డి.

గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.

2026 - 27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలసముద్రం ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న 100 మంది విద్యార్థులకు గోరంట్ల సాయిసుధా స్టూడియో యజమాని అయిన బోయలపల్లి కి చెందిన పసుపుల హనుమంత రెడ్డి స్వచ్ఛందంగా పాఠశాల గుర్తింపు కార్డులను అందించడం జరిగింది. బుధవారం నాడు పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు నీలం అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులందరికీ ఐడి కార్డులతో పాటు స్వీట్లను పంచడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్నతనం నుండే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని, పాఠశాలలోని సాటి విద్యార్థుల పట్ల, మిత్రుల పట్ల దయతో మెలిగి సహకార భావం అలవర్చుకోవాలని , హనుమంత రెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. అలాగే హనుమంత రెడ్డి సేవలను కొనియాడుతూ తన రంగంలో బాగా రాణించి మరింత ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి దాతకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పటేల్ సురేష్, ఉపాధ్యాయులు జయచంద్ర నాయక్, సంప్రీతి బాయి, సునంద, ఆయా శ్రీదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గోరంట్ల లోని సమస్యల పై...మంత్రి దృష్టికి.



మంత్రి సవితమను కలిసిన.... గోరంట్ల సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు.

గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.

గోరంట్ల పట్టణం ప్రధానంగా నెలకొన్న ప్రధాన సమస్యలు త్రాగునీరు,డ్రైనేజీలు, రోడ్లు, వీధిలైట్లు, ప్రస్తుత అభివృద్ధి పనులతో పాటు కదిరి నుండి 7 -30 గంటల తర్వాత ఆర్డినరీ ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ తదితర సమస్యలపై గోరంట్ల సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు నాగే నాయక్, గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, బీ రే వేణుగోపాల్ రాయల్, జయరామ్ లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్ సవితమ్మ దృష్టికి పెనుకొండ క్యాంపు కార్యాలయంలో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు,వెంటనే తక్షణం స్పందించి,దశల వారీగా పరిష్కరిస్తామని అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ ఉద్యమానికి తాడిపత్రి బార్ అసోసియేషన్ సంఘీభావం



లేఖరుల డిమాండ్లు న్యాయమైనవే - ప్రభుత్వం పునఃపరిశీలించాలి

తాడిపత్రి, జులై 22 సీమ వార్త సాయంత్రం :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు జరుగుతున్న రాష్ట్రవ్యాప్త పెన్ డౌన్ ఉద్యమానికి తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు మరియు న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు.బార్ అసోసియేషన్ ప్రతినిధులు స్వయంగా ఉద్యమ శిబిరానికి విచ్చేసి దస్తావేజు లేఖరులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, దస్తావేజు లేఖరులు ఎదుర్కొంటున్న సమస్యలు న్యాయమైనవేనని స్పష్టం చేశారు. వారి జీవనోపాధికి భంగం కలిగించే ఏ నిర్ణయమైనా ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న దస్తావేజు లేఖరుల వృత్తిని పరిరక్షించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడ్డారు.దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మాట్లాడుతూ, తమ ఉద్యమానికి మద్దతు ప్రకటించిన తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు మరియు న్యాయవాదులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సంఘీభావం ఉద్యమానికి మరింత ధైర్యాన్ని, బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి దస్తావేజు లేఖరులు, సంఘ ప్రతినిధులు మరియు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి...

.ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సూర్యనారాయణ.

బద్వేల్ జూలై 22 సీమవార్త. సాయంత్రం.



బద్వేలు నియోజకవర్గం, బద్వేల్ టౌన్ ఎన్‌జీఓ కాలనీ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఉఉమ్మడి కడప డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే స్పందిస్తూ సేవలు అందించటమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని సూర్యనారాయణ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## మోదీని విమర్శించే స్థాయి బొద్దింకలకు ఉందా.

తీవ్రంగా ఖండించిన.... పురం బిజెపి మాజీ కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి.

హిందూపురం జులై 22 సీమ వార్త సాయంత్రం.



మోడీ ని విమర్శించే స్థాయి నైతికత ఏమాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు గానీ లెఫ్ట్ లాబీ బొద్దింకలకు గాని కుహనా లౌకికవాదులకు కానీ విమర్శించే స్థాయి నీది కాదు అని బిజెపి పట్టణ అధ్యక్షురాలు మాజీ కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ విషయంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు అన్ని చేస్తోంది ఇటువంటిది మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం జరిగినది ఎగ్జామ్ కమిటీ చైర్మన్ ని తీసేసి కొత్త చైర్మన్ మార్చడం జరిగినది ఎవరైతే నీటి పేపర్ లీక్ సంబంధించిన దోషులు ఉన్నారో వారందరినీ ఆధారాలతో సహా శిక్షించడం జరుగుతుంది ఒకపక్క చట్టం తన పని తాను చేసుకుంటూ నీట్ బాధితుల కోసం రీ ఎగ్జామ్ కండక్ట్ చేసి రోజుల వ్యవధిలోనే రిజల్ట్స్ కూడా రావడం త్రీ ఎక్సమ్ లో క్వాలిఫై అయిన విద్యార్థులు సంతోషంతో ర్యాలీలు చేయడం మనం చూసాం ఇదంతా భారతదేశాన్ని గౌరవించి రాజ్యాంగం పరంగా ముందుకు నడిచే నిజమైన భారతీయుల ఒకవైపు ఉంటే దేశద్రోహులు, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన దుర్మార్గులు, తుక్కుడే తొక్కే గ్యాంగ్, కమ్యూనిస్టు భావజాలం ఉన్న పార్టీలో ఆమ్ ఆద్మీ పార్టీ అందరూ కలిసిన నరేంద్ర మోడీ గారిని ఏమి చేసుకోలేరు ఎందుకంటే ప్రజలందరూ ఆయనతో ఉన్నారు నిజమైన భారతీయులందరి ఆశీర్వాదం నరేంద్ర మోడీ కి భారతీయ జనతా పార్టీకి ఉందని తెలియజేశారు ఈరోజు పట్టణం నందు పీఎం వీక్ పేపర్ లీక్ అనే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేయడం చాలా హాస్యాస్పదం రీ ఎక్షమ్ లో పాస్ అయి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు వారి పని వారు చేసుకుంటున్నారు అరిగిపోయిన పాత రికార్డు లాగా అయిపోయిన పెళ్ళికి ఇప్పుడు మేళం కొట్టినట్టు ప్రజలను పక్క దారి పట్టించేందుకు హడావిడి చేస్తుంటారు ప్రజల్లో మీ పరిస్థితి వీకయ్యి ఎలక్షన్ టైం లో మీ డిపాజిట్లు గల్లంతయి అట్టడుగు స్థాయికి చేరుకున్నారు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని జాతీయ భావజాలంతో భారతదేశం అభివృద్ధికి కృషి చేయండి కొంతమంది ప్రజలైన మిమ్మల్ని నమ్ముతారు లేని పక్షాన ఇటువంటి అనవసరమైన హిపోక్రసీ, ప్రాపగాండా, డ్రామాలు చేస్తే భవిష్యత్తులో ప్రజల మీకు బుద్ధి చెప్తారని తెలియజేశారు

## ఎస్ ఎఫ్ బి అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



అమరాపురం జూలై 22సీమవార్త సాయంత్రం.

అమరాపురం విద్యార్థి భవిష్యత్తు నిర్మాణ సంఘం (స్టూడెంట్ ఫ్యూచర్ బిల్డింగ్ అసోసియేషన్) ఎస్ ఎఫ్ బి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు ధనుంజయ, కార్యదర్శి టి. నాగభూషణలు తెలిపారు. ఇందులో 8,9,10 వ తరగతిలో చదువుతున్న అమరాపురం మండలంలోని విద్యార్థులు ఎస్ ఎఫ్ బి అసోసియేషన్ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ లో అత్యంత మార్కులు సాధించిన వారికి కంప్యూటర్ బహుమతిగా ఇస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ యొక్క ఆధార్ కార్డు, ఫోటో,500 రూపాయలు ఫీజుతో అమరాపురం బస్టాండ్ సమీపంలోని సురేష్ కాంప్లెక్స్ లో ఉన్న ఎస్ ఎఫ్ బి అసోసియేషన్ ఆఫీస్ నందు అప్లై చేసుకోవచ్చని తెలిపారు, టాలెంట్ టెస్టులో కంప్యూటర్ కు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే ఉంటాయని, ఆసక్తిగల విద్యార్థులు అసోసియేషన్ ఆఫీస్ నందు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అప్లై చేసుకున్న విద్యార్థులకు అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆగస్టు 2వ తేదీ ఆదివారం రోజున పరీక్ష నిర్వహించబడును. అలాగే రొళ్ళ , అగలీ మండలంలోని విద్యార్థులకు రొళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆగస్టు 2వ తేదీ పరీక్ష నిర్వహించబడును. రొళ్ళ, అగళిమండలాలకు చెందిన విద్యార్థులు రొళ్ళమండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ పక్కన ఉన్న డిజిటల్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్లో ఉన్న ఎస్ ఎఫ్ బి అసోసియేషన్ ఆఫీస్ నందు అప్లై చేసుకోవాల్సిందిగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయ, నాగభూషణ్ తెలిపారు. పూర్తి వివరాల కోసం 93 464 93337 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని వారు కోరారు.

## జానకి కి గోరంట్ల కళాబృందం నివాళులు

హాజరైన... రాష్ట్ర హస్తకళ డైరెక్టర్ సోమశేఖర్.

కళాకారులకు భోజనవసతి కల్పించిన టిడిపి నేత సోమశేఖర్.





గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.

తెలుగు గడ్డ లో పుట్టిన ఆడబిడ్డ గాన పుట్టిన గాయని జానకి కు గోరంట్ల మండల కళాబృందం వారిచే అశ్రు నివాళులు అర్పించారు. గోరంట్ల పట్టణంలోని సత్యసాయి బాబా సేవా సదన్ లో బుధవారం కళాబృందం ఆధ్వర్యంలో జానకి కి నివాళులర్పించె ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు రాష్ట్ర హస్త కలల డైరెక్టర్ సోమశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గోరంట్ల మండల కేంద్రంలోని సత్య సాయి సేవ సదన్ లో గాయని జానకి కి కళాకారులు నివాళులర్పిస్తూ ఆమె చిత్రపటానికి పూలు జల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పాడిన పాటలను పాడి ఆమె జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో భజన మండలి మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, కళాకారులు నరేంద్ర రాయల్, నాగభూషణ, మోహన, కృష్ణమోహన్, మల్లికార్జున,జయచంద్ర, రత్నమయ్య, సూరి, రామాంజనేయులు, నాగభూషణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలి.



సామూహిక రిలే దీక్షలో...డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండార్స్, డిటిపి ఆపరేటర్లు.

బద్వేల్ జూలై 22 సీమవార్త సాయంత్రం.

బద్వేల్ లోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఎదుట గత 3 రోజులుగా డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండార్స్, డిటిపి ఆపరేటర్లు మరియు సహాయకులు సామూహిక రిలే నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముఖం శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు ఐక్యంగా నిరసన దీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి స్పందన రాలేదని తెలియజేశారు. ముఖ్యంగా జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని మా ప్రధాన డిమాండ్ ఈ జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల పైగా కుటుంబాలుకు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ పరం చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తుల చేత రిజిస్ట్రేషన్లు జరిగితే ప్రజల ఆస్తులకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని మేము జీవో నెంబర్ 396 ను వ్యతిరేకిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సీనియర్ దస్తావేజు రైటర్స్ బాలిశెట్టి వెంకటేశ్వర్లు, నరసింహారావు, లక్ష్మీనారాయణ, స్టాంపు వెండర్స్ ఆదినారాయణ, శివకుమార్, డిటిపి ఆపరేటర్లు వెంకట సుబ్బయ్య, నరసింహులు, చైతన్య, అంజాద్ భాష తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ పై దాడి రాక్షసత్వమే.

ఢిల్లీ ఘటనను తీవ్రంగా ఖండించిన... పెనుగొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నరసింహులు.

గోరంట్ల జులై 22 సీమ వార్త సాయంత్రం.



దేశవిద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద నిర్వహించిన ధర్నా లో పోలీసులు రాహుల్ గాంధీ పై చేయి చేసుకొని రక్త గాయం చేయడం దేశ చరిత్రలో చీకటి రోజు అని పెనుగొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాలసముద్రం నరసింహులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ .దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల్లో దాదాపు 120 పేపర్లు లీకై ఎంతోమంది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకుంటే విద్యార్థులకుమద్దతుగా రాహుల్ గాంధీ ధర్నా చేస్తే భారత దేశ విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే దేశ ప్రతిపక్ష నాయకుడి పైపార్లమెంట్ సభ్యులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం దుర్మార్గమైన చర్య. దీన్ని ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు అందరూ ఖండించవలసిన అవసరం ఉంది దీనికి నైతిక బాధ్యత వహించి ప్రధాని నరేంద్ర మోడీవెంటనే రాజీనామా చేయాలని పెను కొండకాంగ్రెస్ పార్టీ తరపున మేము డిమాండ్ చేస్తున్నాం ఇంచార్జ్ నరసింహులు పేర్కొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881